క్లుప్తంగా

నేటి నుంచి వేంకటేశ్వరుని తిరునాళ్ల



బెల్లంకొండ: మండల కేంద్రంలోని కొండపై గల ఆలయంలో వేంకటేశ్వరుని తిరునాళ్ల వేడుకలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త గోపాల్ నాయక్ తెలిపారు. శనివారం స్వామి వారి ప్రత్యేక పూజలు, కల్యాణం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వారి దేవాలయం కొండపై ఉండటంతో కొండపై ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకర్షణగా ఉంది. తిరునాళ్ల వేడుకల సందర్భంగా కోలాటం, బండ ఎత్తుడు పోటీలు, మోకు లాగు పందేలను నిర్వహించనున్నామన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు కార్యనిర్వాహకులు బాలాజీ నాయక్, గురస్వామి ముసుగు శ్రీనివాసరావు తెలిపారు.

అత్యధిక ఓట్లు ఉన్న బూత్‌లపై దృష్టి పెట్టండి



పెదకూరపాడు: నియోజకవర్గంలోని 14 పోలింగ్ బూత్‌ల్లో 1,200కు పైగా ఓటర్లు ఉన్నారని, ఆయా బూత్‌ల్లో ఓటు వేసే ప్రక్రియ ఆలస్యం అవుతుందని, అటువంటి బూత్‌లను రెండు బూత్‌లుగా ఏర్పాటు చేయాలని పలు రాజకీయ పార్టీల నేతలు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, ఐసీడీఎస్ పల్నాడు జిల్లా పీడీ ఉమాదేవిని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉమాదేవి అధ్యక్షతన నియోజకవర్గ రాజకీయ పార్టీల నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాం-6, 7, 8 ఆమోదం, తిరస్కరణపై రాజకీయ పార్టీలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌వోలు ధనలక్ష్మి, మీసాల దానియేలు, శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

క్రోసూరు: వేసవి కాలంలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిపోయే ప్రజలకు, అధికారులకు తాగునీటి అవసరాల కోసం కార్యాలయం ఆవరణలో చలివేంద్రం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వీవీ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా భగవాన్ ట్రస్ట్ సీఈవో కోట సాంబశివరావు మూడు 20 లీటర్ల కూలింగ్ క్యాన్లతో పాటు ఏడబ్ల్యూటీ కార్డు అందజేసినట్లు తెలిపారు. వాటిని ఉపయోగించుకుని నీళ్లు ఎప్పుడు అవసరమైనా తెచ్చుకోవచ్చునన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయటం ఎంతో సంతోషకరమని తహసీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు లేళ్ల బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ప్రారంభం



పెదకూరపాడు: స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో క్రమశిక్షణ, దేశ భక్తి, సేవాభావం పెంపొందుతాయని 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్పీ పాఠశాలలో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను శిక్షకులు బి.అనూరాధ, కె.కోటేశ్వరరావులతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ లండ్ గైడ్స్ శిక్షణలో రాణించిన విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందన్నారు. ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా స్కౌట్స్ మాస్టర్ కోటేశ్వరరావు, గైడ్స్ శిక్షకురాలు అనూరాధలు నియమ నిబంధనలను తెలియజేశారు. శిక్షణతో సమాజ సేవకులుగా తీర్చిదిద్దబడతారన్నారు. సౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ధరణికోటలో సిలువ మార్గం



అమరావతి: ఈ లోకంలో పాప కర్మలు చేసిన పాపాన్ని హరించటానికి ఏసుక్రీస్తు సిలువపై శిక్షింపబడటానికి గుర్తుగా శుక్రవారం మండల పరిధిలోని ధరణికోటలో క్రీస్తు ఆరాధికులు సిలువ మార్గం కార్యక్రమం నిర్వహించారు. భక్తులతో సిలువ మార్గం తొలుత ధరణికోట అంబేడ్కర్ కాలనీలోని ఆర్‌సీఎం చర్చి నుంచి క్రోసూరు రోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ సెంటర్ మీదుగా తిరిగి చర్చి వద్దకు చేరింది. ఈ మార్గం మధ్యలో 14 స్థానాలలో దేవుని వాక్యాన్ని చదివి క్రీస్తు ఆరాధికులకు వినిపించారు. ఆరాధికులు సిలువను మోయటానికి పోటీ పడ్డారు. అనంతరం చర్చిలో ఫాదర్ గంగోలు భాస్కరరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపదేశకులు అచ్యుతకుమారి, స్వప్న, సామియేలు, పెద్ద ఎత్తున క్రీస్తు ఆరాధికులు హాజరయ్యారు.

కానరాని స్వచ్ఛత.. జాడలేని సంపద

- ప్రకటనలకే పరిమితమైన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర
- గ్రామలలో ఎక్కడి చెత్త అక్కడే
- నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

అచ్చంపేట: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంటూ ఆర్భాటంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించే ప్రభుత్వం ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతుంది. ఇటీవల స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రపై గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు గ్రామాలలో పంచాయతీ సిబ్బంది మొక్కుబడిగా ర్యాలీలు, చేపట్టినా.. వాటిని ఆచరణలో పెట్టలేకపోయారు. మండలంలోని గ్రామాలలో ప్రధాన రహదార్లపై చెత్త నిల్వలు రోజురోజుకు పెరిగిపోయి కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచిస్తుంటే క్షేత్ర స్థాయిలో అంటువంటి జాడలు కనిపించడం లేదు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఆలోచనతో 2019కి ముందున్న ఇదే కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డులను నిర్మించింది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేసి సంపద సమకూర్చుకోవచ్చని చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. విధివిధానాలు లేకుండా ప్రభుత్వం చేపట్టిన పనుల వల్ల కోట్లాది రూపాయల ప్రజా ధనం వృధా అవ్వడమే కాకుండా నిర్మించిన డంపింగ్ యార్డు షెడ్లు నిరుపయోగంగా మారాయి. అచ్చంపేట మండలంలోని 23 గ్రామ పంచాయతీలకుగాను ఒకటి, రెండు తప్ప మిగతా గ్రామాలలో డంపింగ్ యార్డులన్నీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని గ్రామాలలో డంపింగ్ యార్డులు గ్రామానికి దూరంగా ఉండటంతో అక్కడ అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయి. సంపద సృష్టి కేంద్రాలుగా పిలువబడే డంపింగ్ యార్డులు ఉపయోగంలో లేకపోవడంతో చెత్తను రహదారుల పక్కన పడేస్తున్నారు. ఆ చెత్త వానకు తడిసి, ఎండకు ఎండి కుళ్లిపోయి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. మరోపక్క రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తను పశువులు తిని రోగాల బారిన పడుతున్నాయి.





మాదిపాడులో కృష్ణానదికి వెళ్లే దారిలో చెత్త కుప్పలు



కోగంటివారిపాలెంలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

రోగాల పాలవుతున్నారు

గ్రామాలలో సేకరించిన చెత్త నుంచి సంపదను సృష్టించడానికి నిర్మించిన డంపింగ్ యార్డులు ఇప్పుడు కేవలం చెత్త కేంద్రాలుగా మారాయి. కొన్ని పంచాయతీలలో చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేయడానికి, సేకరించిన ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, గాజు సీసాలను పొడి చేసేందుకు లక్షల రూపాయల వ్యయంతో యంత్రాలను తెప్పించారు. ఇప్పుడు ఆ యంత్రాలు తుప్పుపట్టి నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రజలకు మేలైన సౌకర్యాలు కల్పించేందుకు, చెత్తను తొలగించి వీధులను శుభ్రంగా ఉంచేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికి కేవలం రూపాయి మాత్రమే వసూలు చేయడాన్ని ఘోరమైన తప్పిదంగా చిత్రీకరించి చెత్తకు పన్ను అని హేళన చేసిన ఇదే ప్రభుత్వం ఇప్పుడేం చేస్తుంది. గ్రామాలలోని చెత్త మొత్తాన్ని పొలాలకు వెళ్లే రహదారుల పక్కనే కుప్పలు కుప్పలుగా పడేస్తున్నారు. అవి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. రోడ్ల వెంట వేసిన చెత్తతో గ్రామస్తులు రోగాలపాలవుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రోడ్ల పక్కనే చెత్త పడేస్తున్నారు. గ్రామంలో నిర్మించిన డంపింగ్ యార్డు నిరుపయోగంగా ఉంది. రోడ్డు పక్కనే పడేసిన చెత్త కుళ్లిపోయి దోమలకు నిలయంగా మారింది. దీనివల్ల గ్రామస్తులు తరచూ రోగాల బారిన పడుతున్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– కొండలు గంగాధరరావు, కోనూరు

సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటాం

సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



నకరికల్లు: సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామని సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి భరోసానిచ్చారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన నకరికల్లు మండల సోషల్ మీడియా కన్వీనర్ షేక్ నాగుల్‌మీరాను శుక్రవారం కలిశారు. నియోజకవర్గంలోని ప్రతి సోషల్ మీడియా కార్యకర్తకు అండగా నిలబడతామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక సోషల్ మీడియా కార్యకర్తలపై ఒత్తిడులు, కేసులు, దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కుట్రలను ధైర్యంగా ఎదుర్కోవాలని మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పడాల గురవారెడ్డి, దూదేకుల బాషా తదితరులున్నారు.

మెడికల్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

రాజుపాలెం: ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి కూలీలు మెడికల్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి కూలీలకు ఎండదెబ్బ తట్టుకునేందుకు మెడికల్ కిట్‌లను శుక్రవారం అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నీరసం రాకుండా, ఎండ దెబ్బ తట్టుకునేందుకు మెడికల్ కిట్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సూపరింటిండెంట్ బసవకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్‌కి విరాళం

సత్తెనపల్లి: కన్నా రంగయ్య చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.50 వేలు విరాళంగా అందించేందుకు వైష్ణవి వారి ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాలల నూతన యాజమాన్యం ముందుకు వచ్చింది. పట్టణంలో స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను శుక్రవారం కలిసి రూ.50 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ దగ్గుబాటి శివబ్రహ్మారెడ్డి, ఓ శ్రీనివాసాచారి, మాచిభట్ల సుబ్బరాజు, షేక్ జానీ బాషా, యు.సోమేశ్వరరావు, దేగల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పనులు పరిశీలన

పట్టణంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సిద్ధం చేసిన పనులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో పోస్టల్ శాఖకు చెందిన 48 సెంట్లలో నిర్మించనున్న ప్రధాన తపాలా కార్యాలయం నూతన భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన సందర్భంగా ఆ స్థలాన్ని పరిశీలించి పోస్టల్ అధికారులతో మాట్లాడారు. అలాగే ఈ నెల 23న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్న ఏరియా వైద్యశాలలోని 100 పడకల గదులను, త్వరలో ప్రారంభించనున్న రైల్వే స్టేషన్ రోడ్డులోని మున్సిపల్ స్టేడియంను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు, నాయకులు సయ్యద్ పెద్ద కరీముల్లా, పూజల వెంకటకోటయ్య, కోమటినేని శ్రీనివాసరావు, రంగిశెట్టి సుమన్‌కుమార్, మారెళ్ళ స్వామి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కన్నాకు చెక్కు అందిస్తున్న ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యం

వృద్ధురాలు అదృశ్యంపై కేసు నమోదు

పెదకూరపాడు: బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వృద్ధురాలు ఇంటికి రాని ఘటన మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామంలో చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన, కుమారుడు వజ్రాల నరేంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని 75త్యాళ్ళూరు గ్రామానికి చెందిన వజ్రాల ముతేశ్వరమ్మ(65) ఈ నెల 17వ తేదీన గుంటూరు జిల్లా తాడికొండ గ్రామంలోని తన బంధువు కృష్ణమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి నేటికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు వజ్రాల నరేంద్రరెడ్డి పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముతేశ్వరమ్మ కోసం బంధువులు, చుట్టపక్కల వారు, తెలిసిన వారిని విచారించినా ఆమె జాడ లేదని నరేంద్రరెడ్డి తెలిపారు. దీంతో పెదకూరపాడు పోలిసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజుపాలెం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిగూడెం సమీపాన గల బ్రాందీ షాపు వద్ద జరిగింది. మండలంలోని మొక్కపాడు గ్రామానికి చెందిన పేర్నపాటి నాగేశ్వరరావు(45) గత మూడు రోజుల క్రితం బ్రాందీ షాపు సమీపంలోని చప్టాపై కూర్చొని ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం చప్టా కింద కాలువలో పడి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి స్థానిక ఎస్ఐ వేణుగోపాల్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా మృతుడిది మొక్కపాడు గ్రామమని తెలిసింది. బంధువులకు సమాచారం అందించగా మృతుని భార్య లక్ష్మి, కుమారుడు నాగరాజు వచ్చి చూసి ఇంటి నుంచి మూడు రోజుల క్రితం వచ్చాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు కుటుంబం గత ఏడేళ్ల నుంచి దొడ్లేరులో ఉంటున్నారు. మొక్కపాడు బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వచ్చాడని భార్య చెప్పింది. మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉంది.

అంగన్‌వాడీ కార్యకర్తను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీఐటీయూ నేత మహేష్

సత్తెనపల్లి: పట్టణంలోని 27వ వార్డులో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న గుజ్జర్లపూడి జ్యోతి అధికారులు, కొందరు పత్రికా విలేకరుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని సీఐటీయూ సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో అభివృద్ధి పనుల పరిశీలన నిమిత్తం శుక్రవారం వచ్చిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిని వేధింపులకు గురిచేసి ఆత్మహత్య చేసుకునే స్థితికి తీసుకువచ్చిన పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, నోడల్ ఆఫీసర్ అరుణ, ఇద్దరు విలేకరులు (సాక్షి, సాక్షిటీవి కాదు)పై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందిస్తున్న పెండ్యాల మహేష్

శక్తి యాప్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళశాలలో విద్యార్థులతో ఎస్ఐ నాగేంద్రరరావు, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు

క్రోసూరు: క్రోసూరు ఎస్ఐ నాగేంద్రరరావు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో క్రోసూరులోని పాలిటెక్నిక్ కళశాల, పాఠశాలల్లో శుక్రవారం మహిళల రక్షణ కొరకు రూపొందించిన శక్తి యాప్, డ్రగ్స్ వద్దు త్రో అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యార్థులతో మాట్లాడుతూ శక్తి యాప్ మహిళల కోసం రూపొందించినదని అన్నారు. ప్రతి మహిళ ఈ యాప్‌ను తమ ఫోనులో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. తద్వారా ఆపదలో ఉన్నప్పుడు యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే పోలీసులు పది నిమిషాల్లో మీరు ఉన్న లొకేషన్‌కు చేరుకుని రక్షించటం జరుగుతుందన్నారు. అదే విధంగా విద్యార్థులు డ్రగ్స్‌ను దరికి రానీయవద్దని అన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే బయటపడటం కష్టమని అన్నారు. విద్యార్థులను ప్రలోభపెట్టేందుకు డ్రగ్స్ సరఫరా చేసే వారు ప్రయత్నిస్తుంటారని, అలర్ట్‌గా ఉండాలన్నారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే 1972కు ఫోను చేయవచ్చన్నారు. మహిళలు ఎటువంటి పోలీసు సహాయం కావాలన్నా 112, 181, 1930, 1098కు డయల్ చేయాలని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరుణకు ప్రతీక రంజాన్

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: కరుణకు ప్రతీకగా రంజాన్ మాసం నిలుస్తుందని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం పెదకూరపాడు గ్రామంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఎదుట వారికి సాయం చేయాలని, వారి కష్టాల్లో పాలుపంచుకోవాలని పవిత్ర ఖురాన్ చెబుతుందని వివరించారు. దేవుడు చూపిన మార్గంలో నడుస్తూ, అల్లాహ్ బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. మానవత్వం, దయ, కరుణతో దేవుని అనుగ్రహం పొందవచ్చని చెప్పారు.

ప్రారంభమైన రంజాన్ ప్రత్యేక రాత్రి ప్రార్థనలు

క్రోసూరు: పవిత్ర రంజాన్ మాసంలో చివరి పది రోజుల్లో దివ్యఖురాన్ అవతరించిన సందర్భంగా శుక్రవారం నుంచి ప్రత్యేక నమాజులు ప్రారంభించారు. ఈ మాసంలో అత్యంత ప్రాముఖ్యత గలిగిన ఈ పదిరోజులు ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజులు రాత్రి వేళల్లో చేయాల్సి ఉంటుందని మత పెద్దలు తెలిపారు. రంజాన్ మాసం ఖురాన్ ఆదేశాలను పాటిస్తూ ధానధర్మాలు, ఐదుపూటల నమాజులు విధిగా చేయటం ముస్లింల విధి అని మత పెద్దలు తెలిపారు.



మసీదులో ముస్లిం మత పెద్దలతో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

భక్తిశ్రద్ధలతో శుక్రవార ప్రార్థనలు

నకరికల్లు: పవిత్ర రంజాన్ మాసం మూడో శుక్రవారం సందర్భంగా మండలంలోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసం పురస్కరించుకొని ఉపవాస దీక్షాపరులతో పాటు ప్రత్యేకంగా నమాజులో పాల్గొనేందుకు వచ్చిన ముస్లిం సోదరులతో మసీదులు కిటకిటలాడాయి. మండలంలోని అన్ని గ్రామాల్లోని మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నమాజును జరుపుకున్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష పాటిస్తే అల్లాహ్ ప్రసన్నం పొంది పరలోక ప్రాప్తి సిద్ధిస్తుందని మత పెద్దలు తెలిపారు. ఉపవాసంతో పాటు దానధర్మాలు, సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రపంచశాంతి కోసం దువా చేశారు.

నేడు పంచాయతీల్లో పీ-4 సర్వే గ్రామ సభలు

సత్తెనపల్లి: పీ-4 సర్వేకి సంబంధించిన గ్రామ సభలు సత్తెనపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో శనివారం జరుగుతాయని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని అబ్బూరు, బట్లూరు, భీమవరం, బృగుబండ, దీపాలదిన్నెపాలెం, ధూళిపాళ్ల, గండ్లూరు, గర్నెపూడి, గోగులపాడు, గుజ్జర్లపూడి, గోరంట్ల, గుడిపూడి, కట్టమూరు, కట్టవారిపాలెం, కందులవారిపాలెం, కంకణాలపల్లి, కంటెపూడి, కొమెరపూడి, లక్ష్మీపురం, లక్కరాజుగార్లపాడు, నందిగామ, పాకాలపాడు, పెదమక్కెన, ఫణిదం, రెంటపాళ్ల గ్రామాల్లో జరుగుతాయన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

పెదకూరపాడు: కాలం ఏదైనా దానికి తగ్గట్టుగా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగాలని లేదంటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడి కొన్ని సార్లు ప్రాణాంతకంగా మారుతుందని 75త్యాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వీరనాల ఆదిత్య వృద్ధులకు, చిన్నారులకు, మహిళలకు, కూలీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రోజు రోజుకు తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు అనేక సమస్యలు తెచ్చి పెడుతున్నాయన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందన్నారు. ఆ సమయంలో వాంతులు, తలనొప్పి , బలహీనపడటం, కండరాల తిమ్మిర్లు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఒక్కోసారి గుండె పోటు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎండలో ప్రయాణించేవారు తప్పనిసరిగా మంచినీళ్ల బాటిల్ వెంట తీసుకెళ్లాలన్నారు. గుండె, ఊపిరితిత్తులు, మాత్ర పిండాలకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు వీలైనంత వరకు ఇంటి పట్టునే ఉండాలన్నారు. ఎండలో పనిచేసే వారు తలకు టోపీ లేదా కుండవా కప్పుకోవాలన్నారు. ఆహారంలో ఉప్పు, నీరు, అధిక పోషకాలు ఉన్న వాటిని తీసువాలన్నారు. ఏమాత్రం అలసటగా ఉన్నా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దిలిప్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వడదెబ్బ నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వీరనాల ఆదిత్య

నేడు సర్వసభ్య సమావేశం

పెదకూరపాడు: పెదకూరపాడు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు లాభసాటిగా కణుపుల గడ్డి పెంపకం

అమరావతి: వేసవి కాలంలో పశువులకు పచ్చి మేత కోసం కణుపుల గడ్డి పెంపకం రైతులకు లాభసాటిగా ఉంటుందని పశు గణాభివృద్ధి శాఖ ఏడీ వెంకట్రామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన కణుపుల గడ్డి పెంపకం గురించి వివరిస్తూ వేసవిలో నీటి వసతి కల్గిన భూములలో ఏపీడీఎన్ జాతికి చెందిన కణుపుల గడ్డిని పెంచుకుంటే సంవత్సరానికి 80 టన్నుల పచ్చి గడ్డిని పశువులకు అందించవచ్చన్నారు. ఒక ఎకరా కణుపుల గడ్డి పెంచాలంటే 12 వేల కణుపులు నాటాలని, ప్రతి పదిహేను రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలన్నారు. కోతకు కోతకు మధ్య ఎరువులను వేయాలన్నారు. మొదటి సంవత్సరం 8 నుంచి 9 కోతలు వస్తాయని, వీటికి 70 టన్నుల పచ్చి గడ్డి ఉత్పత్తి అవుతుందన్నారు. రెండవ సంవత్సరం 10-11 కోతలు వస్తాయని 80 టన్నుల గడ్డి ఉత్పత్తి అవుతుందన్నారు. పశువులకు ఈ కణుపుల గడ్డి రుచిగా ఉండటం వల్ల ఎక్కువగా తింటాయని దీనిలో విటమిన్స్, మినరల్స్‌తో పాటు 3-4 శాతం మాంసకృత్తులు ఉంటాయన్నారు. ఈ గడ్డి వల్ల పశువులు సకాలంలో ఎదకు రావటం, పాల దిగుబడి పెరగటం వంటి ఉపయోగాలున్నాయన్నారు.



ముత్తాయపాలెం వద్ద ఏపుగా పెరిగిన కణుపుల గడ్డి

27న నూతన ఎంపీపీ ఎన్నిక

అచ్చంపేట: స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు మండల పరిషత్ నూతన అధ్యక్ష ఎన్నిక ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఈ నెల 23న ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించనున్నామన్నారు.